రోడ్డు ప్రమాదంలో కర్ణాటక యువకుడి మృతి

పెబ్బేరు, ఏప్రిల్ 6: కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వినాయక(25) వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై సాయిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉగాది పండుగ కోసం హైదరాబాద్ నుంచి బళ్లారికి వెళ్తుండగా మండలంలోని రంగాపురం శివారుల గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టింది. హెల్మెట్ ధరించినప్పటికీ వాహనం తలపై నుంచి వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సంగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందనడం దురదృష్టకరం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 6 : సాగునీటి ప్రాజెక్టుల్లో, మిషన్ భగీరథ పథకంలో అవినీతి జరిగిందని తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులు ఆరోపించడం దురదృష్టకరమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని ఎస్‌ఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మాజీ మంత్రితో పాటు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు మిషన్‌భగీరథ పనులు నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జూపల్లి మంత్రిగా ఉన్నప్పుడే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 20శాతం పూర్తైతే 90శాతం నిధులు డ్రా చేసిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. రైతులు కష్టాల్లో ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఐపీఎల్‌లో మ్యాచ్‌లు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు.


రాబోయే ఎంపీ ఎన్నికల్లో మా అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులకు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానికేతరుడైన మల్లురవికి ఇక్కడి సమస్యలు పట్టవని, ఆయనను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ ఇవ్వలేదని పేర్కొన్నారు. రాజ్యాంగం రద్దు చేస్తామన్న బీజేపీకి మద్దతు ఇవ్వొద్దని ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకుడు మంద కృష్ణమాదిగను ఆయన కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీలు రజిత, సోమేశ్వరమ్మ, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక ఆర్థిక సమానత్వమే లక్ష్యం

బిజినేపల్లి: అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం దళిత నాయకుడు విజయ్ ఇంట్లో దళిత సంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. నాయకులు కొత్తపల్లి కుమార్, జోగు ప్రదీప్, ఐతోలు లక్ష్మయ్య, కాశన్న, చెన్నయ్య, రామచందర్, విజయ్ కాంత్, లేట్ల అశోక్, డప్పు లక్ష్మణ్, ఊశన్న, శ్రీశైలం, పరశురాములు తదితరులు ఉన్నారు.

వనపర్తి పురపీఠం కాంగ్రెస్ వశం

- చైర్మన్‌గా పుట్టపాక మహేష్, వైస్ చైర్మన్‌గా పాకనాటి కృష్ణ ఏకగ్రీవం
- 11 మంది కౌన్సిలర్ల గైర్హాజరు



చైర్మన్, వైస్ చైర్మన్‌లకు నియామక పత్రాలు ఇస్తున్న ఆర్డీవో పద్మావతి; చిత్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 6: వనపర్తి మునిసిపాలిటీలో మూడు నెలలుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అధికార కాంగ్రెస్ పార్టీకే చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలు దక్కాయి. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీవో పద్మావతి సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 15 మంది, బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఆరు మంది, ఒకరు టీడీపీ, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడితో కలిపి 23 మంది సభ్యులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తొమ్మిది మంది, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఇద్దరు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఓటింగ్ సమావేశానికి సగానికిపైగా సభ్యులు హాజరు కావడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రవేశపెట్టారు. దీంతో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన 13వ వార్డు కౌన్సిలర్ పుట్టపాక మహేష్‌ను చైర్మన్‌గా కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేష్, చీర్ల సత్యం సాగర్ బలపరిచారు. 20వ వార్డు కౌన్సిలర్ పాకనాటి కృష్ణను వైస్ చైర్మన్‌గా టీడీపీ కౌన్సిలర్ లక్ష్మి బలపరిచారు. ఇద్దరికి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కొత్తగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో రిటర్నింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయం ముందు బాణసంచా కాల్చి, సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అరాచకాలు పోయి, నేడు ఆత్మగౌరవం గెలిచిందన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించి నిజమైన అభివృద్ధిని కొత్తగా ఎన్నికైన పాలకులతో చేసి చూపిస్తామన్నారు.

ఫలించని బీఆర్‌ఎస్ వ్యూహాలు..

మూడు నెలల క్రితం చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన కౌన్సిల్ సభ్యుల్లో ఒకరైన పుట్టపాక మహేష్‌ను ఎలాగైనా చైర్మన్ కాకుండా చేయాలన్న బీఆర్‌ఎస్ వ్యూహాలు ఫలించలేదు. ఎన్నో ఎత్తులు, పై ఎత్తులు వేసినప్పటికీ ఎమ్మెల్యే మేఘారెడ్డి మెజారిటీ సభ్యులను ఏకం చేయడంలో సఫలం అయ్యారు. దీంతో బీఆర్‌ఎస్ ఎత్తులు పారక.. పోటీ లేకుండానే కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది.

మోదీ పాలనే దేశానికి రక్ష

- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కోయిలకొండ ఏప్రిల్ 6: దేశానికి మోదీ పాలనే శ్రీరామ రక్ష అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శనివారం కోయిలకొండ మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కేంద్రం పథకాలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు లబ్ధిపొందారన్నారు. ప్రజలకు ఉచితంగా రేషన్ అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. దేశంలో 25 వేల కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించిన ఘనత మోదీదేనని అన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టడుతుండగా దేశాన్ని ఆ ముప్పును తప్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బూత్ స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని చెప్పారు. అంతకు ముందు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి కేవీఎల్ఎన్ రాజు, పార్టీ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు అంకిళ్ల చెన్నారెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

టిఫిన్ బైఠక్‌లో..

కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన అరుణ టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని అంకిళ్ల సమీపంలో వెంట తెచ్చుకున్న భోజనాన్ని కార్యకర్తలతో కలిసి తిన్నారు.

తాగునీటి ఎద్దడిపై నజర్

- అన్ని మండలాలకు అత్యవసర నిధుల కేటాయింపు
- బోర్లు, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులు
- అవసరమైతే గ్రామాల్లో వ్యవసాయ బోర్లు లీజుకు తీసుకునేలా ఏర్పాట్లు
- కోయిల్‌సాగర్‌లో 13.8 అడుగులకు చేరిన నీటిమట్టం
- సమ్మర్‌లో ధోకా ఉండదంటున్న అధికారులు



కోయిల్‌కొండలో తాగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 6: ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నజర్ పెట్టింది. సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించింది. వేసవి వచ్చిందంటే తాగునీటి తండ్లాట మొదలవుతుంది. ఎండలకు భూగర్భ జలాలు అడుగంటడం, జలాశయాలు ఎడిపోవడం, బోర్లు రిపేర్లు కావడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. దీంతో అన్ని గ్రామాల్లో తాగునీరు సరఫరా అవుతోందని, ఎక్కడా సమస్యలు లేవని అధికారలుఉ చెబుతున్నా పలు చోట్ల ఎద్దడి నెలకొంది. తాండాలలో బిందెలు తీసుకుని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వేసవికి ముందే అప్రమత్తమై తాగునీటి సమస్య తలెత్తకుండా నిధులు కేటాయించింది. బోర్లు, పైపుల లీకేజీల మరమ్మతులు, అవసరమైన చోట కొత్తగా బోర్లు వేయడం, పైప్‌లైన్ కోసం ఉమ్మడి జిల్లాకు రూ.10 కోట్లు కేటాయించింది. అందులో ప్రతీ మండలానికి రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు కేటాయించనున్నారు. ఆయా పనుల కోసం యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం నీటి సమస్య అంతగా లేకున్నా.. మరో రెండు నెలలపాటు వేసవి ఉన్నందున ఆలోగా ఎలాంటి సమస్యలు వచ్చిన నీటి ఎద్దడి తలెత్తకుండా అప్పటికప్పుడు పరిష్కరించడం, అవసరమైతే వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం కోసం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. భూగర్భ జలాలు గతేడాదితో పోలిస్తే ఇప్పటికే మూడు మీటర్ల లోతుకు వెళ్లాయి. బోర్లలో నీటి మట్టం తగ్గింది. వ్యవసాయ బోర్లలో సగానికి పైగా నీరు తగ్గడంతో పంటలు ఎండిపోయాయి. రానున్న రోజుల్లో ఎండలు ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో యంత్రాంగం బోర్లను మరమ్మతు చేసే పనిలో పడింది.



బోయపల్లిలోని ఓపెన్ ట్యాంక్ దగ్గర నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులు

మరమ్మతులుంటే వెంటనే చేపట్టాలి

తాగు నీటి బోర్ల మరమ్మతునకు గురైతే వెంటనే బాగు చేయించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. దాంతో మండల స్థాయిలో అధికారులు పనిచేయని బోర్లను గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నారు. గత నెలలో వారం రోజుల పాటు వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమో గుర్తించారు. గుర్తించి చోట చాలావరకు పనులు ప్రారంభించారు. మోటార్లు కాలిపోయిన చోట వెంటనే బాగు చేయించడం, కొన్నాళ్లుగా నిరుపయోగంగా ఉన్న చేతిపంపులను ఉపయోగంలోకి తేవడం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున పంచాయతీ కార్యదర్శులకు ఈ బాధ్యతలను అప్పగించారు. మిషన్ భగీరథ, కోయిల్‌సాగర్ జలాశయాల నుంచి తాగునీరు అందుతున్నా, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే బోరుబావులను అందుబాటులో ఉండేలా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. మొత్తంగా వేసవి ముగిసి, వర్షాలు పడేవరకు తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది.

కోయిల్‌సాగర్‌లో 13.8 అడుగుల మేర నీరు


కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 13.8 అడుగుల మేర నీరు ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని పలు మండలాలకు తాగునీరు సరఫరా అవుతోంది. వేసవిలో తాగునీటికి ఎలాంటి ధోకా ఉండదని అధికారులు చెబుతున్నారు. సాగు నీటికి ఇప్పటికే నీరివ్వడం, పంటల సమయం కూడా దాదాపు అయిపోవడంతో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ఉపయోగించనున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేదు. అన్ని గ్రామాలకు రోజూ తాగునీరు అందిస్తున్నాం. సమ్మర్‌లో నీటి ఎద్దడి లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. జలాశయాలతో పాటు పవర్ బోర్లు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులను చాలా వరకు చేపట్టారు. బోర్లు ఫ్లషింగ్ చేయడం జరిగింది. అవసరమైతే రైతుల దగ్గర వ్యవసాయ బోర్లు లీజుకు తీసుకుని సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

- వెంకటరమణ, మిషన్ భగీరథ ఎస్ఈ

ఆరెంజ్ అలర్ట్



- అత్యధిక మండలాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత



మహబూబ్‌నగర్‌లో ఎండకు గొడుగు పట్టుకొన్ని వెళ్తున్న చిన్నారి

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 6 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అధిక మండలాల్లో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ఆరెంజ్ అలెర్ట్‌లోకి వెళ్లాయి. దీంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

- పాలమూరు జిల్లాలో ఎండలు తీవరూపం దాలుస్తున్నాయి. జిల్లాలోని మూడు మినహా అన్ని మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ ఉన్నది. శనివారం చిన్నచింతకుంట మండలంలో 43.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. బాలానగర్‌లో 43.1, గండీడ్‌లో 43.0 డిగ్రీలు నమోదు కాగా అడ్డాకుల, మిడ్జిల్, దేవరకద్రలలో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా అన్ని మండలాలలో 40-41 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదుకావడంతో జనం తీవ్ర ఇబ్బందులకు లోనుకావాల్సి వస్తోంది. రాజాపూర్, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ రూరల్ మండలాలు మాత్రమే ఎల్లో అలర్ట్ జోన్‌లో ఉన్నాయి.
- వనపర్తి జిల్లాలో 43.4 డిగ్రీల గరిష్ఠ, 25.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోట మండలంలోని కానాయపల్లి, పాన్‌గల్ మండలంలలో 43.4 డిగ్రీలు నమోదైంది. పెబ్బేరు, ఆత్మకూరులలో 43.1, చిన్నంబావిలో 42.8, మదనాపూర్‌లో 42.2, ఘణపూర్, అమరచింతలలో 42.0 డిగ్రీలు నమోదైంది. గోపాల్‌పేటలో 41.9, శ్రీరంగాపూర్‌లో 41.7, వనపర్తిలో 41.5, పెద్దమందడిలో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 43.4 డిగ్రీలు దాటింది. ధరూర్, అయిజ, రాజోలిలో 43.1, ఇటిక్యాలలో 43, గద్వాల, అలంపూర్, కేటీదొడ్డిలో 42.7, ఉండవెల్లిలో 41.8, మల్దకల్‌లో 41.7, మానవపాడులో 40.6, గట్టులో 40డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల నుంచి 27 డిగ్రీల మధ్య నమోదైంది.
- నాగర్ కర్నూలు జిల్లాలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలు నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీలుగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా వంగూరు మండలంలో 43.2, కొల్లాపూర్‌లో 43.0, అచ్చంపేటలో 42.7, పదరలో 42.6, పెద్దకొత్తపల్లిలో 42.3, వెల్దండలో 42.1, నాగర్‌కర్నూల్‌లో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లాలో 42 డిగ్రీల గరిష్ఠం, 25 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

భర్త గొంతు కోసిన భార్య

మిడ్జిల్, ఏప్రిల్ 6: తాగి వచ్చి గొడవ పడుతూ, డబ్బుల కోసం వేధిస్తున్నాడని భర్త గొంతును భార్య బ్లేడుతో కోసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం చిలువేరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేపల్లి హుస్సేన్ శుక్రవారం రాత్రి భార్య అలివేలను తాగేందుకు డబ్బులు కావాలని విసిగించాడు. దీంతో భార్యాభర్తల మధ్య కొద్దిసేపు గొడవ జరిగింది. విసుగు చెందిన భార్య హుస్సేన్ గొంతును బ్లేడుతో కోసింది. గమనించిన కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హుస్సేన్ తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

అమ్మ కోసం..

- ప్రతీ గురువారం మెటర్నల్ మార్బిలిటీ క్లినిక్‌లు
- 6 వారాల నుంచి సంవత్సరం వరకు గల బాలింతలకు చెకప్‌లు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో సేవలు ప్రారంభం



పాతపాలమూరు యూపీహెచ్‌సీలో బాలింతలను పరీక్షిస్తున్న వైద్యులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఏప్రిల్ 6: అమ్మ ఆరోగ్యం కోసం ప్రభుత్వం కొత్తగా ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాతాశిశు మరణాలను తగ్గించడంతో పాటు తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం మెటర్నల్ మార్బిలిటీ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆస్పత్రులలో ప్రతీ గురువారం ఈ క్లినిక్‌లను నిర్వహించనున్నారు. కాన్పు అయిన ఆరు వారాల నుంచి ఏడాది వరకు ఉన్న బాలింతలకు ఈ క్లినిక్‌లలో వైద్యసేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని గత నెల మార్చి 28న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాతాశిశు మరణాలను తగ్గించేందుకు..

సాధారణంగా ఓ స్త్రీ డెలివరీ అయిన తర్వాత ఆరు వారాల నుంచి కొన్ని ఆరోగ్య సమస్యలు ప్రారంభమవుతాయి. ముఖ్యంగా రక్తహీనత, పొత్తి కడుపులో నొప్పి, కుట్లు మానకపోవడం, ఆపరేషన్ చేసిన చోట ఇన్‌ఫెక్షన్లు రావడం, యోని మార్గంలో సమస్యలు, ఇతర ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. అంతేకాకుండా రక్తహీనతతో చాలామంది బాలింతలు, ఇరత సమస్యలతో నవజాత శిశువులు మరణిస్తున్నారు. ప్రసవం అయిన తర్వాత చాలా మంది డాక్టర్లను సంప్రదించకుండా సొంత వైద్యం చేయించుకుంటున్నారు. మరికొందరు ప్రైవేటును ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

మెటర్నల్ మార్బిలిటీ క్లినిక్‌ల ఏర్పాటు..

మెటర్నల్ మార్బిలిటీ క్లినిక్‌ల ద్వారా డెలివరీ అయిన బాలింత ఆరు వారాల నుంచి సంవత్సరం వరకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ క్లినిక్‌లలో చూపించుకునే వెసలుబాటు కల్పించారు. ప్రతీ గురువారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు చికిత్స చేయనున్నారు. అన్ని రకాల పరీక్షలు చేసి, వైద్యం అందిస్తారు. మెరుగైన వైద్యం అందించాలంటే వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు.

ప్రతీ నెల 1,600 కాన్పులు

ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో నెలకు 800 నుంచి 1,000 మంది వరకు డెలివరీలు అవుతున్నారు. ప్రవేటులో అదనంగా దాదాపు 600 మంది డెలివరీ అవుతున్నారు. ఈలెక్కన నెలకు 1600 మంది వరకు కాన్పు అవుతుండడంతో వీరంతా ఈ క్లినిక్‌లను వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ఈ క్లినిక్‌ల వల్ల ప్రధానంగా మాతాశిశు మరణాలను తగ్గించవచ్చు. ప్రైవేటులో ఫీజులు ఎక్కువగా వసూలు చేస్తుండడంతో ఈ క్లినిక్‌లకు వెళ్లేవారికి ఆర్థికంగా కొంత మేలు జరుగనుందని చెప్పొచ్చు.

అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో..

ఈ క్లినిక్‌లను అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో నిర్వహిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులలో ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీ అయిన వారు కూడా ఈ క్లినిక్‌లను వినియోగించుకోవచ్చు. జిల్లాలోని 17 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీలు, రెండు కమ్యూనిటీ ఆస్పత్రులలో అమలు చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల లో కూడా ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు.

పామాయిల్ తోటకు నిప్పు

మానవపాడు, ఏప్రిల్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం కొర్విపాడు గ్రామంలో పామాయిల్ చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మహమ్మద్ హుసేన్‌కు చెందిన పామాయిల్ తోటకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు ఎగబాకడంతో తోటలోని 40 చెట్లు, వాటర్ డ్రిప్ పైపులు, సిలిండర్ కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ పరిధిలోని సీబీఎం కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28న సూర్యాపేట జిల్లాలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో జరగబోయే తెలంగాణ స్టేట్ మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20లో క్రీడాకారులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు హాజరై విజయవంతం చేయాలని స్వాములు కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అమరచింత, ఏప్రిల్ 6 : కల్లు తాగొద్దని భర్త మందలించినందుకు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న భార్య చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జయమ్మ(45) తరచు కల్లుకు బానిస కావడంతో ఇబ్బంది పడ్డ ఆమె భర్త భార్యను రెండురోజుల క్రితం గట్టిగా మందలించాడు. దీంతో ఆమె బాధతో క్షణికావేశంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో కత్తితో మెడను కోసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు స్థానిక ఆసుపత్రికి తరలించి, ప్రథమచికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రెండురోజులుగా చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శనివారం ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిసింది. మృతురాలికి భర్తతో పాటు, ఇద్దరు సంతానం ఉన్నారు.

బూత్కూరులో షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు..


ఆంజనేయులు (ఫైల్)

కొత్తకోట, ఏప్రిల్ 6 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం బూత్కూరు గ్రామానికి చెందిన కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు నక్క ఆంజనేయులు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఆంజనేయులు ఐదు రోజుల క్రితం ఫ్యాక్టరీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు బాయిలర్‌లో పడిపోయి తీవ్రంగా గాయపడిన విషయం పాఠకులకు విదితమే. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 6 : బంధువు దినవారాల కోసం చెరువుకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో ఈత కొడుతూ మునిగి మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన మ్యాతరి రాములు(35) దాయాది పదిరోజుల క్రితం మృతి చెందడంతో శనివారం దశదినకర్మకు గాను తలనీలాలు తీసుకునేందుకు గ్రామంలోని భీమసముద్రం చెరువుకు వెళ్లాడు. చెరువులో దిగి ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. బంధువులు చెరువులోకి దిగి ఎంత వెతికినా శవం లభ్యం కాలేదు. మృతుడికి భార్య మ్యాతరి రేణుక, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బిజినేపల్లి, ఏప్రిల్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామ శివారులోని లింగారెడ్డి కుంట సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి లింగారెడ్డికుంట సమీపంలో పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం రావడంతో దాడి చేసి పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.36,970 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై పరస్పర కేసులు

వెల్దండ, ఏప్రిల్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాచూరుతండాలో ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా ఇరువురి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వడ్త్యావత్ శ్రీను, పాత్లావత్ రాంచందర్‌లు పాత కక్షలను మనసులో ఉంచుకుని శుక్రవారం ఒకరిపై ఒకరు ఇనుప గొట్టంతో దాడి చేసుకున్నారు. ఇద్దరికీ గాయాలు కాగా శనివారం ఒకరిపై ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, ఏప్రిల్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం మంతటి గ్రామానికి చెందిన కొమ్ముల ఆంజనేయులు తన ట్రాక్టర్‌లో శనివారం ఉదయం దాసర్లపల్లి గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు కానిస్టేబుల్ భానుప్రకాష్‌రెడ్డి పట్టుకొని పరిశీలించారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ

- వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్ట హామీ
- సోనియా, రాహుల్‌ను కలిసినా ప్రయోజనం లేకపోయింది
- అఖిలపక్షాన్ని తీసుకెళ్లమని ఉద్యమిస్తే కేసీఆర్ జైల్లో పెట్టాడు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కందనూలు, ఏప్రిల్ 6 : ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని డీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్ట హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సోనియా, రాహుల్‌ను కలిసినా ఏమాత్రం ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఒక ప్రైవేట్ బిల్లు పెట్టమని కోరినప్పటికీ ప్రతిపక్షాలు ఏమాత్రం స్పందించలేకపోయాయని అన్నారు. మోదీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే వర్గీకరణ సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మాదిగ జాతి పట్ల సంపూర్ణ అవగాహన ఉందని, ఎస్సీ వర్గీకరణపై రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. గత పదేళ్లుగా అధికారంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ వర్గీకరణ కోసం అనుకూలమని చెబుతూ వారిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆందోళన చేస్తే రెండు నెలల పాటు తనను జైలులో పెట్టారని మందకృష్ణ విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో వర్గీకరణ సాధ్యపడదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి, నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారాయణచారి, భూషయ్య ఉన్నారు.

తెలుగు భాష, సంస్కృతిని కాపాడాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్


ఉగాది విశిష్టతను వివరించిన ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ చెన్నప్పను సన్మానిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 6 : తెలుగు భాషతో పాటు, సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. శనివారం పీయూ అకాడమిక్ భవనంలోని సెమినార్ హాల్‌లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. అంతకుముందు విశిష్ట అతిథి, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ చెన్నప్ప ఉగాది పర్వదిన విశిష్టతను వివరించారు. అనంతరం ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, కొల్లాపూర్, గద్వాల పీజీ సెంటర్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ మార్క్ పోలోనిస్, చవ్వ వెంకటరెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ సంధ్యారాణి, అధ్యాపకులు డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, డాక్టర్ రవీందర్‌గౌడ్, డాక్టర్ తిరుపతయ్య డాక్టర్ వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందుతున్న భారత్

ప్రపంచ దేశాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో మన భారతదేశం ఒకటని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. శనివారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ఇండియన్ ఎకానమీ, గ్రోత్ అండ్ ప్రాస్పెక్ట్' అంశంపై నిర్వహించిన వన్‌డే నేషనల్ సెమినార్‌కు ఆయన హాజరై, ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టంగా ఉండాలంటే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని తెలిపారు. అంతకుముందు ప్రధాన వక్త, డైరెక్టర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్ టీఎల్ఎన్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులు అర్థశాస్త్రంలో పరిశోధనలు చేయాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన బస్సు ఫ్రీ టికెట్ల పంచాయితీ


ఖిల్లాఘణపురం పోలీస్ స్టేషన్ ముందు నిలిపిన ఆర్టీసీ బస్సు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 6 : ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ టికెట్ల పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వనపర్తి జిల్లా కేంద్రం నుంచి ఖిల్లాఘణపురం మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న టీఎస్06 యుఏ9381 బస్సులో శనివారం సాయంత్రం సోలీపూర్ గ్రామంలో ఓ బాలిక ఎక్కింది. బాలిక కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు చూపించి మహిళా కండక్టర్‌ను ఫ్రీ టికెట్ ఇవ్వాలని కోరారు. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేస్తేనే ఫ్రీ టికెట్ ఇవ్వడానికి కుదురుతుందని మహిళా కండక్టర్ వారికి సూచించారు. దీంతో బస్సులో ప్రయాణికులకు, మహిళా కండక్టర్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో డ్రైవర్ ఖిల్లాఘణపురం పోలీస్‌స్టేషన్ వద్ద బస్సును నిలుపగా మహిళా కండకర్ ఫ్రీ టికెట్ గొడవను పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ కార్డు అప్‌డేట్ చేయలేనందున టికెట్ తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులకు పోలీసులు సూచించడంతో సమస్య సద్దుమనిగింది. కాగా, ఎండలో బస్సును నిలిపి ఫ్రీ టికెట్ల గొడవ చేయడంతో మహిళా ప్రయాణికులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

గణప సముద్రం ముంపు భూముల సర్వే

- క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలిస్తున్న భూసేకరణ అధికారులు
- పట్టా భూముల్లో బావులు,బోర్ల గుర్తింపు
- రైతులతో పట్టాదారు పాస్ పుస్తకం నకలు సేకరణ


ఖిల్లాఘణపురం చెరువు వద్ద ముంపు రైతుల భూపత్రాలు సేకరిస్తున్న భూసేకరణ డీటీ నాగరాజు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 6 : గణప సముద్రం జలాశయంలో ముంపునకు గురయ్యే 388.03 ఎకరాలకు సంబంధించిన భూములపై భూ సేకరణ అధికారులు క్షేత్ర స్థాయిలో శనివారం రైతుల సమక్షంలో సర్వే నిర్వహించారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం గణప సముద్రం చెరువులో పంట పొలాల్లోని బోరు బావులను, పైపులైన్లను, కరెంటు కనెక్షన్లు, వ్యవసాయ బావులకు సంబంధించిన పూర్తి వివరాలను భూసేకరణ అధికారులు పరిశీలించి రైతుల ఫొటోలతో సహా నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వం భూసేకరణ కింద మొదటి గెజిట్‌లో వచ్చిన విధంగా 388.03 ఎకరాలకు సంబంధించిన రైతుల వద్ద పట్టాదార్ పాసు పుస్తకం, ఆర్వోఆర్, పహాణీల లాంటి నకలు పత్రాలను అధికారులు సేకరించి భూమి విస్తీర్ణాన్ని సరిపోల్చుకుంటున్నారు. కొన్ని సర్వే నంబర్లలో తండ్రి పేరు పై ఉన్న భూమిలో కుమారులు సేద్యం చేస్తున్నారు. ధరణిలో ఉన్న ప్రకారం భూ యజమానుల వివరాలను సవరణలను పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు రిజర్వాయర్‌లో మునిగి సుమారు 365 ఎకరాల పంట పొలాలకు సంబంధించిన సర్వేను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. సర్వే చివరి దశకు చేరిందని మరో రెండు రోజుల్లో పూర్తి చేసి పై అధికారులకు నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, ఇరిగేషన్ ఎఈ వెంకటేశ్వర్లు, భూ సేకరణ సర్వేయర్ మొహీనోద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నైవేద్యం నిధులు

- ధూప దీప నైవేద్య అర్చకులకు మూడు నెలలుగా అందని వేతనాలు
- కొత్తగా నియామకమైన వారికి ఆరు నెలలుగా అందని వైనం
- ఆలయాల నిర్వహణకు అప్పులు చేస్తున్న అర్చకులు


శ్రీరంగాపూర్‌లోని శ్రీరంగనాయక స్వామి దేవాలయం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 6 : ధూప దీప నైవేద్య పథకం కింద దేవాలయాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతీనెల కొంత మొత్తంలో నిధులను అందజేస్తోంది. ఆలయాల నిర్వహణ ఖర్చుతో పాటు, ఆయా ఆలయాలను చూసుకుంటున్న అర్చకులకు కొంత మొత్తంగా జీతాలను చెల్లించేది. నెలనెలా అందాల్సిన ఈ నిధులు మూడు నెలలుగా నిలిచిపోయాయి. గత ఏడాది అక్టోబర్‌లో కొత్తగా నియామకమైన అర్చకులకు నాటి నుంచి నేటివరకు ఒక్క నెల వేతనం కూడా అందలేదు. దీంతో అర్చకులు ఆలయాల నిర్వహణకు, తమ కుటుంబ పోషణకు అప్పులు చేసి నెట్టుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు.

పెండింగ్‌లో వేతనాలు

ధూప దీప నైవేద్యం పథకంలో కొనసాగుతున్న ఆలయాలకు ప్రతీనెల ప్రభుత్వం రూ.10వేలు అందజేస్తుంది. ఇందులో ఆలయ ఖర్చులకు రూ.4వేలు, అర్చకునికి వేతనంగా రూ.6వేలు ఆయా ఆలయాల అర్చకుల ఖాతాల్లో దేవాదాయ శాఖ జమ చేస్తుంది. రూ.6వేలు మాత్రమే ఉన్న ఈ మొత్తాన్ని గత ఏడాది మే నెలలో అప్పటి సీఎం కేసీఆర్ రూ.10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. అదే ఏడాది అక్టోబర్‌లో వేతనాల పెంపుతో పాటు, ధూప దీప నైవేద్య పథకాన్ని విస్తరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మరికొన్ని ఆలయాలకు నిధులు అందజేయడానికి ప్రభుత్వం జీవో జారీ చేసింది. కొత్తగా ఎంపికైన ఆలయాలకు అర్చకులను కూడా నియమించింది. కొత్త అర్చకుల నియామకం జరిగి ఆరు నెలలు అవుతున్నప్పటికీ నూతనంగా ఎంపికైన ఆలయాల నిర్వహణ ఖర్చులు, అర్చకుల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదు. అంతవరకే కొనసాగుతున్న పాత అర్చకులకు గత ఏడాది డిసెంబర్ తరువాత నిధులను జమ చేయలేదు. దీంతో అర్చకులు సకాలంలో వేతనాలు అందక అష్టకష్టాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 670 మంది అర్చకులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ధూప దీప నైవేద్య పథకంలోకి 670 ఆలయాలను చేర్చడంతో పాటు, 670 మంది అర్చకులను ప్రభుత్వం నియమించింది. వనపర్తి జిల్లాలో 76 మంది అర్చకులు ఈ పథకంలో కొనసాగుతున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఈ పథకాన్ని విస్తరిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 25 మంది అర్చకులను కొత్తగా నియమించారు. ఇందులో భాగంగానే వనపర్తి జిల్లాలో నలుగురికి కొత్తగా అవకాశం ఇచ్చారు. కానీ వీరందరికీ కొన్ని నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదని వాపోతున్నారు. ఆలయాల నిర్వహణతో పాటు దేవుడికి నిత్యపూజలు, కైంకర్యాలు చేయడానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు.

ఉగాదికైనా నిధులు విడుదల చేయాలి



రానున్న ఉగాది పండుగ ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి. లేకపోతే అర్చకుల కుటుంబాలు పండుగ పూట పస్తులు ఉండాల్సి వస్తుంది. అర్చకులు ఇబ్బందులకు గురికాకుండా ఇక నుంచి ప్రతీనెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అర్చకులందరికీ కనీస వేతనంతో పాటు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నాం.

- పీవీ లక్ష్మీకాంతఆచార్యులు, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

చేపలకు వచ్చే వ్యాధులపై
మత్స్యకారులకు అవగాహన


మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నాగరాజు

ఆత్మకూరు, ఏప్రిల్ 6 : చెరువులో పెంచే చేపలకు వ్యాధులు సోకకుండా ఖమ్మం జిల్లా పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నాగరాజు ఆరేపల్లి గ్రామంలో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. శనివారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామంలోని పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం వారి ఆధ్వర్యంలో చేపల చెరువులను పరిశీలించారు. చేపలకు వచ్చే వివిధ రకాల వ్యాధుల గురించి మత్స్యకారులు చేపల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్ఎస్‌పీఏఏడీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చేపలకు వచ్చే వ్యాధులను తక్షణమే గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా పెంపకందారులు ప్రతీ రెండురోజులకోసారి చెరువులోని నీటిని తీసివేసి కొత్త నీటిని చెరువులకు పంపితే చేపలు సమృద్ధిగా, ఆరోగ్యకరంగా పెరిగే అవకాశం ఉందని ఆయన సూచించారు. వేసవికాలంలో జాగ్రత్తలు పాటించాలని లేకపోతే చేపలు చనిపోయే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిష్ సీడ్ యూనియన్ డైరెక్టర్ ఆనంద్ మత్స్యకారులు వెంకటన్న, ఏటి లక్ష్మణ్ , రాములు, గద్వాల శ్రీను, నాగన్న, సురేందర్, రమేష్, రఘు, నరేంద్ర, రంగన్నతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

తొల్త ముద్దెర కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 6 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని పల్లెకి శిరీష రచించిన తొల్తముద్దెర కవితా సంపుటిని శనివారం కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కవి ఉదయమిత్ర కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే శిరీష కవితారచన చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. విభిన్నమైన వస్తువులను తీసుకుని రాసిన కవితలు ఆలోచింపజేస్తాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మావతి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కవిత్వం రాయడం వాటిని ప్రోత్సహిస్తున్న అధ్యాపకులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వేంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల నుంచి ఎంతోమంది కవులు ఉద్భవించారన్నారు. తొలి అడుగుతోనే శిరీష చక్కటి కవిత్వం ఆవిష్కరించిందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ బి.వెంకటయ్య, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ళ గోపాల్, యువకవి కెపీ.లక్ష్మీనరసింహ, బోల యాదయ్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ లక్ష్మయ్య డాక్టర్ సి.నరసింహులు, డాక్టర్ బూర్గుల స్వరూప, గోవిందు, గోవర్ధన్, ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విఠలాపురం పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

- కానుకుర్తి చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా 23 వేల నగదు పట్టివేత

దామరగిద్ద, ఏప్రిల్ 6 : నారాయణపేట జిల్లా దామరగిద్ద పోలీస్‌స్టేషన్ పరిధిలోని కానుకుర్తి చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో ఇద్దరి వ్యక్తుల నుంచి రూ.ఒక లక్షా 23 వేల నగదు పట్టుబడింది. ఏఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం యానగుంది నుంచి నారాయణపేటకు వస్తున్న కురువ సిద్ధప్ప వద్ద రూ.73 వేల నగదు, కొత్తపల్లి మోహన్‌కుమార్ వద్ద రూ.50 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాటిని గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఏఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం, మద్యం పట్టివేత

మరికల్, ఏప్రిల్ 6 : ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంతో పాటు, మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం పసుపుల గ్రామానికి చెందిన ఎరుకలి చెన్నప్ప అనే వ్యక్తి ఆరు క్వింటాళ్ల 75 కిలోల పీడీఎస్ బియ్యాన్ని సేకరించి ఆటోలో మండల కేంద్రానికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని ఆటోను స్టేషన్‌కు తరలించారు. డిప్యూటీ తహసీల్దార్ కాళప్ప పంచనామా నిర్వహించారు. అదేవిధంగా, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మండలంలోని అప్పంపల్లి గ్రామానికి చెందిన జి.తిరుపతిరెడ్డి మండల కేంద్రం నుంచి బైక్‌పై మద్యాన్ని తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 6.70 ఎంఎల్ లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.3500లు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు తిరుపతిరెడ్డి, ఎరుకలి చెన్నప్పలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవోకు తీవ్ర గాయాలు

పెద్దమందడి, ఏప్రిల్ 6 : రోడ్డు ప్రమాదంలో పెద్దమందడి ఎంపీడీవోకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పెద్దమందడి ఎంపీడీవో సద్గుణ శనివారం మద్దిగట్ల గ్రామంలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేయడానికి పంచాయతీ కార్యదర్శి సతీష్ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తనిఖీ అనంతరం మండల కేంద్రానికి తిరిగి వస్తుండగా బైక్‌ను అడవి పంది ఢీకొట్టింది. దీంతో ఎంపీడీవో కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పెద్దమందడి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించినట్లు ఎంపీవో శ్రీరాంరెడ్డి తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు, నలుగురికి గాయాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 6 : కారు ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం బోయాపూర్ గేటు సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ప్యాట నరసింహతో పాటు, అదే గ్రామానికి చెందిన అబ్బ శ్రీను, రాములు, నాగయ్యలతో కలిసి ఆటోలో శనీశ్వరస్వామిని దర్శించుకొని గ్రామానికి వస్తున్నారు. వెనుకాలే శనీశ్వరస్వామిని దర్శనం చేసుకొని బిజినేపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని కారు బోయాపూర్ గేట్ సమీపంలో వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా పారిపోయాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదంలో రేకుల ఇల్లు దగ్ధం

లింగాల, ఏప్రిల్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొంతమంది వ్యక్తులు కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టడానికి రేకుల కప్పుతో ఓ ఇంటిని నిర్మించి ఆశ్రమం నెలకొల్పారు. ఆశ్రమంలో ప్రతీరోజు భక్తిగీతాలతో భజన, కోలాటం సాధన చేస్తూ వస్తున్నారు. కాగా, శనివారం ఆశ్రమంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆశ్రమంలోని వస్తు సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో ఆశ్రమంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. వంట సామగ్రి, బట్టలు, నిత్యావసర వస్తువులు, తిండిగింజలతో పాటు, రూ.30 వేల నగదు, సంగీత వాయిద్య పరికరాలు ఆహుతై దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ ఉమ పరిశీలించారు.

యాంత్రీకరణతో సాగు లాభదాయకం

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి



ఖానాపూర్‌లో వ్యవసాయ ప్రదర్శన సదస్సును ప్రారంభిస్తున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

బిజినేపల్లి, ఏప్రిల్ 6 : వ్యవసాయంలో రైతులు యాంత్రీకరణ వినియోగం పెంచుకుంటే లాభదాయకంగా ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని ఖానాపూర్‌లో ఆవేఫ్ విద్యార్థులు, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు, ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో రోజు రోజుకు వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాని, యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకొని వాతావరణ పరిస్థితులకు అనువైన పంట రకాలను సాగు చేసుకుంటే వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. గ్రామీణ అనుభవ కార్యక్రమం ద్వారా విద్యార్థులు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ రంగం, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు ప్రత్యేక్ష అనుభవం కలుగుతుందన్నారు. తద్వారా భవిష్యతులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులుగా ఉత్తమ సేవలు అందించవచ్చని అన్నారు. కళాశాలలో నేర్చుకున్న అంశాల కన్నా రైతు క్షేత్రంలో నేరుగా చేస్తూ నేర్చుకోవడం ద్వారా వచ్చిన జ్ఞానాని భవిష్యతులో వ్యవసాయ అభివృద్ధికి వినియోగించుకోవాలని రావేఫ్ విద్యార్థులకు సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ కళావాల డీన్ డాక్టర్ పుష్పావతి, 173 మంది రావేఫ్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బడుగుల బతుకులు బాగుపడతాయి



మహిళలతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ కుమార్

బిజినేపల్లి, ఏప్రిల్ 6 : గ్రామాల్లోని బడుగుల బతుకులు బాగుపడాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గ బీజేపీ అభ్యర్థి భరత్ కుమార్ అన్నారు. మండలంలోని ఖానాపూర్‌లో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలోని వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. టిఫిన్ బైఠక్‌లో పాల్గొని మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌లో బీజేపీ అభ్యర్థిగా తనని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి దిలీపాచారి, నాయకులు అతినారపు తిరుపతయ్య, మట్ట వెంకట్రాములు గౌడ్, మలిశెట్టి వెంకట్ రెడ్డి, భూషయ్య, నారాయణచారి, కమ్మరి శేఖర్, మట్ట బాలస్వామి, లక్ష్మీనారాయణ, అమర్ నారాయణ చౌదరి, దోమ తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు ముచ్చర్లపల్లి, ఊర్కొండపేట, మాధారం, రేవల్లి తదితర గ్రామాల్లో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వారివారి గృహాలపై పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, రాజేందర్ గౌడ్, సందీప్, శ్రీనివాస్, శ్రీనుసాగర్ తదితరులు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో బీజేపీ జిల్లా బొడ్డుపల్లి నారాయణ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోగా మేడిపూర్ గ్రామంలో బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో సొంత ఇళ్లపై జెండాను ఆవిష్కరించుకున్నారు. రానున్న రోజుల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

● వెల్దండ : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను బూత్ కమిటీ అధ్యక్షుడు గంగపురం వెంకటేష్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు జంగయ్యయాదవ్, చిమ్ముల శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాసాచారి, మట్ట విష్ణు, పాండు, శశిధర్‌రెడ్డి, పెద్దయ్య, కొండల్, కోటి, కృష్ణ, కృష్ణారెడ్డి, యాదగిరి, దేవేందర్‌రెడ్డి, రాజు, అనిల్, రమేష్, మనీష్, గెల్వయ్య ఉన్నారు.

నరేంద్రమోదీ మూడవసారి ప్రధాని కావడం ఖాయం

కల్వకుర్తి : దేశంలో బీజేపీని ఎదుర్కొనే శక్తిప్రతిపక్షాలకు లేదని, మూడవసారి ప్రధానిగా మోదీ కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో శనివారం 22వ వార్డులో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జెండాను ఆవిస్కరించి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్, నాయకులు బ్యాంగి వివేకానంద, రవిగౌడ్, మల్లేష్, శ్రీకాంత్, రాములు, వినయ్, మధుసూదన్‌రెడ్డి, చింటూ, సాయి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు కోసం పోరాడదాం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 6: పేద, మధ్య తరగతి విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్న నూతన విద్యా విధానం రద్దు కోసం పోరాడదామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా మూడవ మహాసభలు నిర్వహించారు. మహాసభలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యా రంగాన్ని గాలికి వదిలేసి సమస్యలోకి నెట్టిందని విమర్శించారు. విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు మెస్ చార్జీలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. యూనివర్సిటీల్లో మెస్ చార్జీలు సకాలంలో చెల్లించకపోవడంతో బిల్లులు కట్టలేక విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగం బలోపేతంపై దృష్టి పెట్టకుండా ప్రైవేటు, కార్పొరేట్ విద్యను ప్రోత్సహించడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను మెరుగుపరుచాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ.సయ్యద్, కార్యదర్శి తారాసింగ్, ఉపాధ్యక్షులు కార్తీక్, రాజేష్, రామకృష్ణ, లలిత, తరుణ్, శివ, కార్తీక్, అజయ్ పాల్గొన్నారు.

సీఎన్ఆర్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ విజయవంతం

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలోని సీఎన్ఆర్ పాఠశాలలో నిర్వహించి స్పోర్ట్స్‌మీట్ విజయవంతమైంది. శనివారం నిర్వహించిన క్రీడల ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి స్థానిక డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ప్రముఖ డాక్టర్ నూర్జహాన్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నూర్‌జహాన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు యోగా, అభిరుచి కలిగిన ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. సీఎన్ఆర్ పాఠశాల వ్యవస్థాపకులు సి.భాస్కర్‌రావు, చంద్రకళ, ప్రధానోపాధ్యాయులు కవిత, యాజమాన్యం ఫసియోద్దీన్, వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో ఘనంగా వన మహోత్సవం

చారకొండ, ఏప్రిల్ 6: మండల పరిధిలోని ఎర్రవల్లిలో శనివారం గ్రామస్థులు వన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పాడి పశుసందదను కాపాడాలని వేడుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా వనానికి వెళ్లి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వేళ గ్రామస్థులు ఆడి పాడారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి

తెలకపల్లి, ఏప్రిల్ 6 : ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, దాతలు పోల్‌దాసు రాము, ఎంపీపీ కొమ్ము మధులు అన్నారు. మండల కేంద్రంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ ప్రీమియం లీగ్ సీజన్2 ఫైనల్ మ్యాచ్ శనివారం నిర్వహించగా ప్రథమ బహుమతి తెలకపల్లి రాయల్ కింగ్స్ విజయం సాధించారు. వీరికి షీల్డ్‌తో పాటు 30వేల రూపాయల నగదు బహుమతిని భరత్‌ప్రసాద్, దాత పోల్‌దాసురాములు అందజేశారు. రన్నర్‌గా తెలకపల్లి క్యాపిటల్స్ గెలుపొందగా వీరికి షీల్డ్‌తోపాటు 15వేల నగదు బహుమతిని ఎంపీపీ కొమ్ము మధు అందజేశారు. భరత్‌ప్రసాద్, ఎంపీటీసీ ఆర్.రమేష్, మాజీ ఉప సర్పంచ్ నరహరి, బాబుసాగర్, చోటమియా, గ్రౌండ్ స్పాన్సర్లు ఆశీర్వాదం, శివయ్య, ఆర్గనైజర్లు భారీగారి లక్ష్మణ్, హర్షద్ రాజు, ఇరుజట్ల ప్లేయర్లు, క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకూడదు

- జిల్లా ప్రత్యేక అధికారి శ్రుతి ఓజా

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకూడదని, క్షేత్ర స్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి శ్రుతి ఓజా అన్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించగా నాగర్‌కర్నూల్ జిల్లాకు శ్రుతి ఓజా ఐఏఎస్ అధికారిని నియమించడం జరిగింది. శనివారం ప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌తో కలిసి ఐడీవోసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మండల ప్రత్యేక అధికారులు, మిషన్‌భగీరథ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మునిసిపల్ కమిషనర్లతో వేసవి తాగునీటి సరఫరా, సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో తాగునీటి డిమాండ్ ఎంత ఉంది, సప్లయ్ ఎంత ఇస్తున్నాం అనే వివరాలను మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్‌ను అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ల లీకేజీలు ఎక్కడ ఉండవద్దని, ఎస్‌డీఎఫ్ ద్వారా మిషన్ భగీరథ కోసం మంజూరైన పనులు యుద్ధప్రాతిపదికన రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ బోరు బావులు, చేతి పంపులు అన్ని మరమ్మతులు చేయించారా లేదా అని ఎంపీడీవోలను ప్రశ్నించారు. మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులపై సరైన మూతలు ఉండే విధంగా నీటి కాలుష్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రైవేట్ వ్యక్తుల వ్యవసాయ బోరు బావులు సైతం లీజుకు మాట్లాడి సిద్ధంగా ఉంచుకోవాలని తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా పర్యవేక్షణకై జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. జిల్లాలోని 20మండలాల 461 గ్రామపంచాయతీలు, నాలుగు మునిసిపల్ పట్టణాల్లో నీటి కొరతను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతేకాకుండా ఆయా చోట్ల నీటి సరఫరాకు అటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నామని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపిస్తున్నామని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో ప్రతిరోజు పర్యటించి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ముందుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ వివరిస్తూ జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ఇప్పటి వరకు చేపట్టిన పనులు, ముందస్తు ఏర్పాట్లను వివరించారు. అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, మిషన్‌భగీరథ ఈఈలు శ్రీధర్‌రావు, సుధాకర్‌సింగ్, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, నాలుగు మునిసిపాలిటీల కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి శ్రుతి ఓజా, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

హామీల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ విమర్శించారు. రైతులకు వెంటనే రూ.2లక్షల రుణమాఫీ అమలుపర్చాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సమస్యలు పరిష్కరించాలని శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మూడు నెలలైనా పూర్తిస్థాయిలో ఎందుకు అమలుపర్చలేదని ప్రశ్నించారు. రైతులకు వరికి బోనస్ 500రూపాయలు చెల్లించాలని, ఎండిన పంటలకు ఎకరాకు 25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ కల్వకుర్తి మండల అధ్యక్షుడు సింగం విజయ్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యులు డాక్టర్ విజితారెడ్డి, దశరథనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కల్వకుర్తి మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎముక జంగయ్య, నాయకులు జోగు వీరయ్య, ఎల్ఎన్.రెడ్డి, బాలయ్య, భాస్కర్‌రావు, మనోహర్‌రెడ్డి, గణేష్, చెన్నకేశవులు, లింగం, సురేష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, నేరటి శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో బీఆర్ఎస్ నిరసన దీక్షలో మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

పేర్లు, అధికారం మార్పే: గువ్వల

అచ్చంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగింది పేర్లు మార్పు, అధికారం మార్పే తప్ప మారేమీ మారలేదని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రైతు దీక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కరువు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందే తప్ప మారేమీ కాదన్నారు. డిసెంబరు 9న రైతు రుణమాఫీపై సంతకం చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి నేటివరకు రుణమాఫీ ఊసేలేదన్నారు. అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు.

ప్రభుత్వం రాగానే నీళ్ల గోస, కరెంట్ గోసతో రాష్ట్రంలో 200మంది రైతుల ఆత్మహత్యలకు కారణమయిందన్నారు. సొంత నియోజకవర్గంలో ప్రాజెక్టులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కండువాలను స్వయానా ముఖ్యమంత్రే కప్పుతున్నారే తప్ప దానిపై దృష్టి పెట్టినట్టు రాష్ట్రంలోని ప్రజలపై దృష్టి పెడితే బాగుంటుందన్నారు. రైతులకు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వరికి మద్దతు ధర రూ 2500తో పాటు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తామని, చేతకాని మాటలు మాట్లాడి ఇప్పుడు వాటి పేరు ఎత్తడం లేదన్నారు. రాష్ట్రంలో ఉచిత బస్సు పేరుతో మహిళలకు గొడవలు పెట్టారే తప్ప మహిళలకు ప్రభుత్వం చేసింది ఏమిలేదన్నారు.

రాబోవు రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలకు ప్రజాపాలన అందిస్తామన్నారు. పదర జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, నాయకులు మనుపటేల్, శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎండ సెగలు



ఎండతాకిడికి నిర్మానుష్యంగా మారిన మార్కెట్



ఎండలో గొడుగు సహాయంతో వెళ్తున్న మహిళ



గొడుగు నీడన సామగ్రి అమ్ముకుంటున్న మహిళ

లింగాల, ఏప్రిల్ 6: భానుడు చుక్కలు చూపిస్తున్నాడు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉష్ణోగ్రతల మార్పుల కారణంగా భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వేసవిలో ముదిరిన ఎండలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మే నెలలో ఉండాల్సిన ఉష్ణోగ్రతలు ఏప్రిల్ మాసంలో నమోదు కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతతో పాటు గాలిలో తేమ శాతం తగ్గడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మధ్యాహ్నం 12గంటలవరకే దాదాపుగా 41.3డిగ్రీలకు నమోదు కావడంతో ప్రజలు తమ అవసరాలకోసం బయటికి వెళ్లలేక పోతున్నారు. ముదిరిన ఎండలకు మండలంలోని పరిసరగ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రానికిరావాలంటేనే ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శీతల పానీయాల షాపులకు గిరాకీలు అధికమవుతున్నాయి. శీతల పానీయాలతోపాటు పండ్ల రసాలు, కొబ్బెరి బొండాలతో సేద తీర్చుకోవడంతో వ్యాపారులకు విపరీతంగా గిరాకీలు పెరిగాయి. వ్యాపారులకు మరీ ముఖ్యంగా ఫ్యాన్లు, కూలర్లకు గిరాకీలు విపరీతంగా పెరిగాయి. ఎండ తట్టుకోలేక దుకాణాలను మూసి ఇళ్లల్లో సేద తీర్చుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని వ్యాపారులు వాపోతున్నారు.

మండుటెండలకు ఉపాధి కూలీల ఇబ్బందులు

మన్ననూర్: మండుటెండల్లో ఉపాధి పనులకు వెళుతున్న కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. 45 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ఉపాధి హామీ అధికారులు టెంట్లు ఏర్పాటు చేయకపోగా, ఓఆర్ఎస్ పాకెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులు చేసే కూలీలు ఎండ తాపానికి ఇబ్బంది పడుతున్నారు. జీవనోపాధి కోసం ఉపాధి పనులకు వెళుతున్నామని, తమకు ప్రభుత్వం కల్పించే వసతులను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కూలీ పనులు చేసే ప్రాంతాల్లో టెంట్లు ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.



తుర్కపల్లిలో మండుటెండలో తమ హాజరు నమోదు చేయిస్తున్న ఉపాధి కూలీలు

జన జాతరకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఊర్కొండ, ఏప్రిల్ 6: హైదరాబాద్‌లోని తుక్కుగూడ జనజాతర బహిరంగ సభకు శనివారం మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి రావడానికి తమవంతు కృషి చేస్తున్నామని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని తెలిపారు. వెళ్లిన వారిలో నాయకులు ద్యాప నిఖిల్ రెడ్డి, వెంకటయ్య గౌడ్ ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్, పెద్దకార్పాముల, గంట్రావుపల్లి, వెన్నచెర్ల, చంద్రకల్, చిన్నకార్పాముల, నాయినోనిపల్లి తదితర గ్రామాల నుంచి దాదాపు వంద వాహనాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, వి.సత్యం, పి.చిన్నయ్య, పెద్ద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, ప్రతాప్ రెడ్డి, రామచంద్రయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాలస్వామి తదితరులు ఉన్నారు.

● తిమ్మాజిపేట: మండలంలోని గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కేంద్రానికి చేరుకుని నేరుగా కాంగ్రెస్ సభకు బయల్దేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌బహదూర్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉస్మాన్, లక్ష్మీనారాయణ, రఘూఫ్, మనోహర్, వెంకటయ్య, వరుణ్‌కుమార్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: తుక్కుగూడలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతర భారీ బహిరంగసభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షుడు మోతీలాల్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డిలు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాలలో తరలించారు.

● చారకొండ : జన జాతర బహిరంగ సభకు అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారయణ రెడ్డి పిలుపు మేరకు మండలంలోని చారకొండ, జూపల్లి, తిమ్మాయిపల్లి, సిర్సనగండ్ల, చంద్రాయన్‌పల్లి తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, ముస్తఫా ముజ్జుబాయి, సాంబయ్యగౌడ్‌ల ఆధ్వర్యంలో వెళ్లారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, జేసీబీ వెంకటయ్యగౌడ్, శ్రీపతిరావు, జైపాల్, అశోక్‌గౌడ్, కొండలయ్యగౌడ్, శివ, సహదేవ్, భగవాన్, సిరాజ్, మహిళలు తదితరులున్నారు.



కల్వకుర్తిలో తుక్కుగూడకు బయల్దేరే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

● మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా తుక్కుగూడలో శనివారం నిర్వహించిన జనజాతర సభకు అమ్రాబాద్ మండలం మన్ననూరు, తుర్కపల్లి, మాచారం, ప్రశాంత్‌నగర్ తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సుల్లో సభకు జనసమీకరణ చేశారు. మన్ననూరు ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, దాసరి బాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు తుల్స్యా నాయక్, రేణయ్య, రమణగౌడ్, లోకనాథం, పెర్మాల వెంకటేశ్వర్లు, హన్మంత్‌రెడ్డి, సంబు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, శివాజి పాల్గొన్నారు.

● వంగూరు: మండలంలోని వివిధ గ్రామాల నుంచి రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు తీసి ప్రత్యేక వాహనాలలో వెళ్లారు.

● పెంట్లవెల్లి: జన జాతర బహిరంగ సభకు శనివారం మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, గోప్లాపూర్ తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహనాయుడు, కాంగ్రెస్ నాయకులు ఎర్రశ్రీను, బాలస్వామి, మోహన్ పాల్గొన్నారు.

● కొల్లాపూర్: తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభకు కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మండలాలు, గ్రామాలతో పాటు కొల్లాపూర్ పట్టణం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ వాహనాల్లో తరలివెళ్లారు. మండలాల, గ్రామాల నుంచి ఆర్టీసీ వాహనాల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

హామీలను అమలు పరుస్తాం

కల్వకుర్తి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తూచాతప్పకుండా అమలుపరుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాపాలనను చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. తుక్కుగూడలో జరిగే జనజాతర సభకు బయల్దేరే ప్రత్యేక వాహనాలను శనివారం కల్వకుర్తిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించబోతుందని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.

వెన్నచెర్లలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో ఈ నెల 9, 10వ తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దామోదర్, ప్రదీప్, కుర్మయ్యలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నచెర్ల గ్రామంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ సహకారంతో మొదటి బహుమతి రూ. 20వేలు, రెండవ బహుమతి రూ. 15వేలు, మూడవ బహుమతి రూ. 10వేలు, నాల్గవ బహుమతి 5వేల రూ పాయలను అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు ఈ నెల 8వ తేదీన 600 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

రాజ్యాంగ రక్షణ సభను విజయవంతం చేయాలి

తాడూరు, ఏప్రిల్ 6 : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మేడ్చల్‌లో ఈ నెల 8వ తేదీన రాజ్యాంగ రక్షణ సభను ఏర్పాటు చేస్తున్న సందర్భంలో అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చింతసత్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాజ్యాంగరక్షణ ముగింపు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగరక్షణకు సంబంధించి తీసుకొచ్చిన చర్యలపై జరగబోయే సభలో చర్చించడం జరుగుతుందన్నారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, కుర్మయ్య, కురుమూర్తి, జెట్టిచంద్రయ్య, మల్లేష్, వెంకటస్వామి, రాములు, రాంచంద్రరావు, చెన్నయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

బిజినేపల్లి, ఏప్రిల్ 6 : వేసవి తాపాన్ని తట్టుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు శనివారం లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆలోచన తెలిపారు. వైద్య సిబ్బంది పద్మ, జ్యోతి, ఆశ కార్యకర్తలు శారద, అనిత, పద్మ, కృష్ణవేణి, బాలమణి, నాగమ్మ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వంగూరు, ఏప్రిల్ 6: మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఏవో తనూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరి పంటకు కనీస మద్దతు ధర పొందాలంటే రైతులు కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ఏపీఎం చంద్రయ్య, సీసీ సువర్ణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేతనాలు చెల్లించాలని ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్టుకు శనివారం వినతి పత్రం అందజేశారు. యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మహేష్, శంకర్, ఉపాధ్యక్షుడు బాలమైసమ్మ, సహాయ కార్యదర్శి అర్జున్, నాయకులు వెంకటేశ్, కృష్ణయ్య, మల్లేష్, హుస్సేనమ్మ, బాలయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటీ రణదివె ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : ప్రముఖ కార్మిక ఉద్యమ నాయకుడు బీటీ రణదివె ఆశయాలను కొనసాగిద్దామని ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బీటీ రణదివె వర్ధంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసులు, నిరంజన్, మహేష్, అర్జున్, మైసమ్మ, వెంకటేశ్, కృష్ణయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: బీటీ రణదివె స్ఫూర్తితో కార్మిక పోరాటాలు నిర్వహిద్దామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో బీటీ రణదివె వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీ రణదీవే చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పలువురు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్, జిల్లా నాయకుడు దశరథం మాట్లాడారు. ఆశ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి, సీఐటీయూ నాయకులు శంకర్, ఆశావర్కర్ యూనియన్ నాయకులు రమణమ్మ, జ్యోతి, లక్ష్మీ, దేవమ్మ, సురేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి : బీటీరణదివె స్ఫూర్తితో కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు నిర్వహిద్దామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయం దగ్గర బీటీరణదివె చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూల మాల వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు చేస్తున్న ఆర్ఎంపీ చికిత్స కేంద్రం సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

కందనూలు, ఏప్రిల్ 6 : ఒక ఆర్ఎంపీ ఆసుపత్రిలో భ్రూణ హత్యలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ గోవర్ధన్‌లు శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డుకాలనీలోని బీసీ కాలనీలో విజయ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌ను నెలకొల్పి విజయ అనే ఆర్ఎంపీ వైద్యురాలు గర్భిణులను లింగనిర్ధారణ చేయించిన తర్వాత ఆడపిల్లలు ఉంటే అబార్షన్లకు పాల్పడుతున్నది. అందులో భాగంగానే శుక్రవారం రాత్రి లింగాల మండలం దత్తారం గ్రామానికి చెందిన మహిళకు స్కానింగ్ చేసిన తర్వాత ఆడపిల్ల అని నిర్ధారణ చేయించుకుని అబార్షన్ చేస్తుండగా, ఆమె వేస్తున్న కేకలు, అరుపులు విని చుట్టు పక్కల మహిళలు ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌లోకి వెళ్లారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అబార్షన్‌కు గురైన మహిళను జిల్లా ఆసుపత్రికి తరలించి, ఆర్ఎంపీ వైద్యురాలిని అరెస్టు చేశారు. ఈ సంఘటనపై జిల్లా వైద్యాధికారులకు సమాచారమివ్వడంతో జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, ఉప వైద్యాధికారి డాక్టర్ వెంకటదాస్, స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ అబెద్‌ఆలీ, స్థానిక ఎస్ఐ గోవర్ధన్‌ల ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రంలో ఉన్న ఫైళ్లు, మందులను పరిశీలించి సీజ్ చేశారు. అందులో ఉన్న స్కానింగ్ రిపోర్టులను, అబార్షన్లకు ఉపయోగించిన స్పిరిట్, మందులను సీజ్ చేశారు. ఈ సంఘటనపై వైద్యాధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

● పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు తమ పరిమితికి మించి వైద్య చికిత్సలు చేస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి, స్థానిక తహసీల్దార్ హెచ్చరించారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇతరత్రా అబార్షన్లు, అనుమతులు లేకుండా ఆసుపత్రులను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.